# మంచివాడు

ఇంట్లో కిటికీ దగ్గర కూర్చుని ఉన్న పావనికి రోడ్డు బాగా కనిపిస్తోంది. రెండు వారాల క్రితం ఏక్సిడెంట్‌లో కాలు విరగ్గొట్టుకున్న పావని రెండు రోజులుగా వీల్‌ఛైర్‌లో కూర్చోగలుగుతోంది. తల్లీ తండ్రీ యిద్దరూ ఉద్యోగస్తులవడంతో 'ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరుగంటల వరకూ ఇంట్లో ఒంటరిగా కూర్చుని ఉంటే బోరుకొడుతుందేమో' అనుకుని భయపడింది. అయితే వీల్‌ఛైర్‌లో కిటికీ దగ్గర కూర్చున్నప్పటి నుంచీ టైమ్ గడవడమే తెలియడం లేదు అనుకుంది పావని.

'మనిషి జీవితంలో రోడ్డు ఎంతటి ముఖ్యమైన పాత్రని పోషిస్తుంది? ప్రధానమంత్రీ, రాష్ట్రపతి దగ్గరి నుంచి సామాన్యుల వరకూ అందరూ రోడ్డుమీదికి రావలసిందే. వెరైటీ కోసమో, రిలాక్సేషన్ కోసమో ఓ రెండు రోజులు వీధిలోకి రాకుండా ఇంట్లోనే ఉండగలరేమో గానీ అంతకుమించి ఒక రోజు కూడా ఉండలేరు. వారం రోజులుగా యింట్లోనే ఉండిపోవడంతో పిచ్చి పట్టినట్లు ఉంది తనకి. త్వరగా కాలు నయమైతే రోడ్లో పరిగెత్తాలని ఉంది. స్నేహితురాళ్ళను కలుసుకోవాలని, సినిమాలకు వెళ్ళాలని, వానలో ఎగరాలనీ ఉంది'. అనుకుంది. ఆమెకు బస్సులో ప్రయాణించేటప్పుడు రోడ్డు ప్రక్కన కనిపించే సైన్ బోర్డ్స్ మీది వాక్యాలు గుర్తొచ్చాయి. 'రోడ్ బ్రింగ్ పీపుల్ టుగెదర్'. అబ్బ... ఎంత మంచి కొటేషన్ అనుకుంది.

ఇంతలో ఆమె దృష్టి ఎదురుగా కనిపిస్తున్న పుస్తకాల షాపు ముందు స్కూటర్ పార్క్ చేస్తున్న ఓ యువకుడిపై పడింది. అందంగా, చలాకీగా ఉన్నాడతను. షాపులో ఏదో మ్యాగజైన్ కొని, స్కూటర్ బాక్స్‌లో దానిని ఉంచి, స్కూటర్ స్టార్ట్ చేశాడు. స్కూల్ బ్యాగ్ తగిలించుకుని అటువైపుగా వెళ్తున్న పిల్లలు అతన్ని చూస్తూ ముందుకు నడవసాగారు. ఒకరిద్దరు పిల్లలు చేయి చాపి లిఫ్ట్ కావాలన్నట్టు సంజ్ఞ చేశారు. అతను వాళ్ళను పట్టించుకోకుండా ముందుకు కదిలాడు.

'ఇతనెవరో కర్కోటకుడులా ఉన్నాడు. పాపం చిన్న పిల్లల్ని స్కూటర్‌పై ఎక్కించుకుంటే ఏంపోతుంది అతనికి? మనిషి అందంగా ఉన్నాడే గానీ అతని మనసు అందంగా లేదు' అనుకుంది.

ఆ రోజు నుంచి అతన్ని చూడటం అలవాటుగా మారింది ఆమెకు. అతను ఆ పుస్తకాల షాపు ముందు ఆగడం, పుస్తకాలు కొనడం, పిల్లలు లిఫ్ట్ అడగడం, అతను పట్టించుకోకుండా వెళ్ళిపోవడం జరిగేది. అతని బుద్ధి తెలుసుకున్నారు కాబోలు... ఆ పిల్లలు అతను కనబడినా అతన్ని లిఫ్ట్ అడగకుండా ఊరుకుని, తర్వాత వచ్చే వాహన చోదకులను లిఫ్ట్ అడిగేవారు. ఒక్కోసారి మాత్రం అతని వెనుక సీటులో పిల్లలు కనబడేవారు ఆమెకు. బహుశా అ

**సి.ఎన్. చంద్రశేఖర్**

తని పిల్లలో, బంధువుల పిల్లలో అయి ఉంటా రు వాళ్ళు. లేకపోతే ఆ కర్కోటకుడికి అంత మంచి బుద్ధెలా వచ్చి ఉంటుంది?' అనుకునేది.

ఓ రోజు వీల్‌ఛైర్‌లో కూర్చుని టీవీ చూస్తున్న పావని తన స్నేహితురాలు అర్చనతో బాటు యింట్లోకి అడుగుపెట్టిన అతన్ని చూసి ఆశ్చర్యపోయింది. అతను తను కర్కోటకుడుగా భావించే వ్యక్తి.

"సారీ... పావనీ. నీకు ఏక్సిడెంటై కాలు విరి గిందని తెలిసి ఎంతో బాధపడ్డాను. నేను పి.జి. ఎంట్రన్స్‌కి కోచింగ్ కోసం హైదరాబాదు వెళ్ళాను. అందువల్ల మీ ఇంటికి వచ్చి నిన్ను కలవలేకపోయాను. ఎలా ఉంది యిప్పుడు?" అని అడిగింది అర్చన.

"ఫర్వాలేదు. నొప్పి తగ్గిపోయింది. ఇంకో పదిరోజుల తర్వాత బ్యాండేజ్ పూర్తిగా తీసేస్తారట. కీడులో మేలులా పరీక్షలన్నీ అయ్యాక యీ ఏక్సిడెంటైంది. లేకుంటే ఓ సంవత్సరం వృథా అయ్యేది" అంది పావని.

"నిజమే. అన్నట్టు... యితను మా పెద నాన్న కొడుకు. పేరు భరత్. స్టేట్ బ్యాంక్‌లో పనిచేస్తాడు" అంటూ అతన్ని పరిచయం చేసింది అర్చన.

"హలో నమస్తే" రెండు చేతులూ జోడించి అన్నాడతను.

"నమస్తే. మిమ్మల్ని రోజూ చూస్తూంటాను. ఎదురుగా ఉన్న షాపులో మీరు మ్యాగజైన్స్ కొంటూంటారు కదా?"

"అవును"

తర్వాత వారు చాలాసేపు మాట్లాడుకున్నారు. భరత్ పావనితో ఆమె ఎన్నో రోజుల నుంచి తనకు పరిచయం ఉన్నట్లు ఫ్రీగా మాట్లాడటం ఆమెని ఆశ్చర్యపరచింది. కొంతసేపటి తర్వాత తన మనసులో ఉన్న అనుమానాన్ని బయటపెట్టింది.

"మీరు స్కూలుకెళ్ళే పిల్లలు లిఫ్ట్ అడుగుతున్నా పట్టించుకోకుండా వెళ్ళిపోతూంటారు. మీతో మాట్లాడాక మీరు మంచివారని, మన సున్న వారని నాకర్థమైంది. అటువంటి మీరు ఆ చిన్నపిల్లలకు సహాయం చెయ్యకపోవడానికి ఏదైనా కారణముందా?" అడిగింది భరత్‌ని.

అతను ఆశ్చర్యంగా చూశాడు ఆమె వైపు.

"సారీ... ఈ ప్రశ్న అడిగి మిమ్మల్ని యిబ్బంది పెట్టినట్లున్నాను. నా అతి చనువుకు మన్నించండి" అంది అలా అడిగినందుకు నొచ్చుకుంటూ.

"ఇబ్బందేం లేదు. అనుమానం అంటూ వస్తే దాన్ని నివృత్తి చేసుకోవడం మంచిదే. నేను ఈ ఏరియాకు వచ్చిన కొత్తలో మీలాగే ఆ పిల్లలపై జాలిపడి రోజూ యిద్దరికి నా స్కూటర్‌పై లిఫ్ట్ యిచ్చేవాడిని. కొద్దిరోజుల తర్వాత నేను చేస్తున్న పని తప్పనిపించింది. ఆ పిల్లలు మైళ్ళ కొద్దీ నడవవలసిన అవసరం లేదు. ఓ ఫర్లాంగు లేదా ఒకటిన్నర ఫర్లాంగు దూరం నడిస్తే చాలు. నేను వాళ్ళను ఆ మాత్రమైనా నడవనీయకుండా చేస్తే వాళ్ళు సోమరిపోతులు కారా? అనిపించింది. పైగా అలా లిఫ్ట్ యిస్తూంటే ఒకరిపై ఆధారపడటం వాళ్ళకు అలవాటుగా మారుతుంది. 'మన పని మనం చేసుకోవాలి. ఎవరినీ యాచించకూడదు. ఎవరి సహాయం తీసుకోకూడదు' అన్న మనస్తత్వం వాళ్ళకు యీ వయసు నుంచే అలవడాలి.

అందుకే వాళ్ళకు నా ఆలోచన చెప్పి, ఎవరి

నీ లిఫ్ట్ అడగొద్దని, కష్టపడటం అలవాటు చేసుకోమని చెప్పాను. కొంతమంది 'స్కూలుకు టైమయిపోతూంది కాబట్టి అడిగాము' అన్నారు. అలా లేటు కాకుండా ఉండాలంటే పెందలాడే లేచి ఓ పద్ధతి ప్రకారం పనులు పూర్తి చేసుకుని, కాస్త ముందుగా యింటి నుంచి బయలుదేరాలని చెప్పాను. అప్పట్నుంచీ వాళ్ళు నన్ను లిఫ్ట్ అడగటం లేదు. నా సూచన వాళ్ళందరూ పాటిస్తారని ఆశించను గానీ ఒక్కడైనా పాటిస్తే నేనెంతో సంతోషిస్తాను".

"మరి అప్పుడప్పుడూ మీ స్కూటర్‌పై పిల్లలు కూర్చుని ఉంటారే?"

"వాళ్ళు ఫిజికల్లీ ఛాలెంజ్డ్ చిల్డ్రన్" అన్నాడు భరత్.

అతని వైపు మెచ్చుకోలుగా చూసింది పావని.

'నిజమే... ఎంతోమంది పిల్లలు చదివించే వారు లేక హోటల్స్‌లో, మెకానిక్ షాపుల్లో రాత్రింబవళ్ళూ పనిచేస్తూ, యజమానుల చేత తిట్లూ, దెబ్బలూ తింటూ బ్రతుకుతున్నారు. ఈ పిల్లలకు అటువంటి బాధలేం లేవు. తల్లిదండ్రులు చక్కగా చదివిస్తున్నారు. ఆ కొంతదూరం నడిస్తే యిబ్బందేం లేదు సరికదా చక్కని వ్యాయామం కూడా అవుతుంది.

ముఖ్యంగా భరత్ చెప్పినట్లు ఒకరిని యాచించే గుణం వాళ్ళకు యిప్పట్నుంచే అలవడకూడదు' అనుకుంది.

'తనకెందుకులే' అనుకోకుండా ఆ పిల్లల్లో ఓ మంచి అలవాటుని పెంపొందించడానికి అతను పడిన శ్రమను మనసులోనే మెచ్చుకుంది. అంతటి మంచివాణ్ణి కర్కోటకుడుగా భావించినందుకు సిగ్గుపడింది పావని. ●

